# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

# రేడియో శ్రీలంక ద్వారా క్రీస్తు సంఘముల సువార్త ప్రసారములు

తెలుగు — SATYA VANI

ప్రతి ఆది, మంగళ, గురు, శుక్ర, శనివారాల్లో
మధ్యాహ్నం 2-30 ని॥లకు

ఇంగ్లీషు — THE VOICE OF TRUTH

| | |
|---|---|
| సోమవారము | 9-00 to 9-15 p.m. |
| బుధవారము | 9-30 to 9-45 a.m. |

హింది — SATYA SUSAMACHAR

| | |
|---|---|
| మంగళవారము, గురువారము, శుక్రవారము | 9-00 to 9-15 p.m. |
| ఆదివారము | 1-30 to 1-45 p.m. |

తమిళం — SATYA VAZHI

| | |
|---|---|
| మంగళవారము | 5-30 to 5-45 p.m. |
| గురువారము, శుక్రవారము | 6-45 to 7-00 p.m. |

మళయాళం — THE VOICE OF TRUTH

| | |
|---|---|
| మంగళవారము, శుక్రవారము | 3-45 to 4-00 p.m. |

ఈ కార్యక్రమములను అందరు వినండి. అందరికి విన్పించండి.
తెలుగు, ఇంగ్లీషు భాషలలో లభ్యమగు ఉచిత బైబిలు కరస్పాండెన్సు కోర్సులలో చేరి ఒక క్రొత్త నిబంధనను ఉచితంగా పొందండి. ఈ రోజే మాకు వ్రాయండి :

రాజన్ ఎలక్ట్రిక్ ప్రెస్. కాకినాడ.

# సత్యవాక్కు

క్రైస్తవ మాసపత్రిక

పోస్టు బాక్సు - 80, కాకినాడ - 533 001

ఎడిటర్ : జె. సి. ఛోటే

మేనేజింగ్ ఎడిటర్ : జాషువా గూటం

సంచిక 11 జూన్ 1986 సంపుటి 6

## సంపాదకీయము

### యేసుయొక్కయు క్రొత్తనిబంధన లేఖకుల యొక్కయు మాటలు

### *(The Sayings of Jesus and the Words of New Testament Writers)*

పరిశుద్ధగ్రంథమైన బైబిలును గూర్చి మనము అనేకమందితో మాట్లాడినపుడు లేఖనములపట్ల వారికి గల వివిధములైన ఉద్దేశ్యములను గ్రహింపవచ్చును. యేసుక్రీస్తు చెప్పిన దానికి నూతన నిబంధన గ్రంథకర్తలు చెప్పిన దానికి చాలా వ్యత్యాసమున్నదని వారనుకొనుచున్నట్లు మనము వారి మాటలవలన గ్రహింపవచ్చును. అట్టివారు క్రీస్తు దైవావేశమువలన మాట్లాడెనని అంగీకరింతురు గాని అపొస్తలుడైన పౌలు పేతురు మున్నగు వారు చెప్పిన దానిని ఆ విధముగా అంగీకరించుటకు యిష్టపడరు. పౌలు చెప్పిన యొక అంశమును గూర్చి మాట్లాడుచు "యేసుక్రీస్తు ఎన్నడు యిట్లు చెప్పియుండలేదే" యని అందురు. పౌలు మిగిలిన రచయితలందరు దైవావేశమువలన వ్రాసినప్పటికి వారైతే ఈ విషయమును తృణీకరించుదురు. అయితే క్రీస్తు యొక్క మాటలను బట్టి రక్షింపబడుటకు యొకడు ఏమి చేయవలెను,

ఏ సంఘ సభ్యుడుగా నుండవలెను, ఎట్లు జీవింపవలెను మున్నగు విషయములను బోధింపగలిగినప్పటికిని మిగిలిన అనేక విషయములలో ఇతర గ్రంథకర్తలయొక్క రచనలు అంగీకరింపవలసి యున్నది. అనేక సందర్భములలో యేసుక్రీస్తు పలికిన మాటలు గాక మిగిలిన లేఖనములను ఎక్కువమంది అంగీకరించుటకు యిష్టపడరు. సత్యమును అంగీకరింపజేయలేని యొక అసత్య సిద్ధాంతము కొన్ని వందల సంవత్సరములనుండి బలముగా నాటుకొని యుండుటయే దీనికి కారణము.

యేసుక్రీస్తు సత్యమునే మాట్లాడెనను విషయము యిదివరకే అంగీకరింపబడినది. అదే విధముగా నూతన నిబంధనలోని మిగిలిన లేఖనము లన్నియు గూడ దైవావేశము వలననే వ్రాయబడిన దైవ సత్యములని అంగీకరించుట మన నైతిక బాధ్యతయై యున్నది.

పైన పేర్కొనిన సత్యమును గ్రహించుటకు ముందుగా అపొస్తలులకు యేసుక్రీస్తుకు గల సంబంధమును గూర్చి పరిశీలించుదము. యేసుక్రీస్తు శిష్యులను ఎన్నుకొని తన అనుచరులుగా నుండుటకు వారిని పిలిచెను (మత్త 4 : 18-25). వారందరి పేర్లను మత్తయి 10 వ అధ్యాయములో చూడగలము. క్రీస్తు వెడలిపోయిన పిమ్మట తన పనిని కొనసాగించుటకు ఆయన వారిని ఏర్పరచుకొని వారికి తగిన రీతిగ తర్ఫీదు నిచ్చెను. యేసుక్రీస్తు తన సంకల్పము నెరవేర్చుటకు ఆయన తప్పు చేయని స్వభావముకల దైవ కుమారుడైనప్పటికిని, తప్పుచేయు స్వభావముగల మానవులను ఏర్పరచుకొని వారిపై ఆధారపడవలసి వచ్చినది. తన శిష్యులు సత్యమును బోధించుచు తప్పుచేయు స్వభావమును కలిగి యుండకుండుటకై వారిని సర్వ సత్యములోనికి నడిపించుటకు ఆదరణకర్తను అనగా పరిశుద్ధాత్ముని వారికి పంపి యున్నాడు. "అయితే నేను మీతో సత్యము చెప్పుచున్నాను; నేను వెళ్ళిపోవుట వలన మీకు ప్రయోజనకరము; నేను వెళ్ళనియెడల ఆదరణకర్త

మీ యొద్దకు రాడు; నేను వెళ్ళినయెడల ఆయనను మీ యొద్దకు పంపుదును" (యోహా 16:7) అని క్రీస్తు చెప్పెను. ఆయన ఇంకను యిట్లు చెప్పుచున్నాడు: "అయితే ఆయన, అనగా సత్యస్వరూపియైన ఆత్మ వచ్చినపుడు మిమ్మును సర్వసత్యములోనికి నడిపించును; ఆయన తనంతట తానే యేమియు బోధింపక, వేటిని వినునో వాటిని బోధించి సంభవింపబోవు సంగతులను మీకు తెలియజేయును" (యోహా 16:13). వేరొక సందర్భములో యేసుక్రీస్తు యిట్లనుచున్నాడు: "ఆదరణకర్త అనగా తండ్రి నా నామమున పంపబోవు పరిశుద్ధాత్మ సమస్తమును మీకు బోధించి నేను మీతో చెప్పిన సంగతులన్నిటిని మీకు జ్ఞాపకము చేయును" (యోహా 14:26). క్రీస్తుయొక్క మరణ, సమాధి, పునరుత్థానముల తరువాత ఆయన యింకను పరలోకమందున్న తండ్రి యొద్దకు ఆరోహణముగాక మునుపు శిష్యులతో యిట్లనుచున్నాడు: "అయినను పరిశుద్ధాత్మ మీ మీదికి వచ్చినపుడు మీరు శక్తి నొందెదరు గనుక మీరు యెరూషలేములోను యూదయ సమరయ దేశములయందంతటను భూదిగంతములవరకును నాకు సాక్షులై యుందురని వారితో చెప్పెను" (అ.కా. 1:8). పెంతెకొస్తను పండుగ దినమందు శిష్యులందరు యెరూషలేములో నిలిచి యుండిరి. ఆ పండుగకొరకు ప్రపంచ నలుమూలలనుండి అనేకమంది యూదులు యెరూషలేమునకు వచ్చి యుండిరి. ఆ సందర్భములో పరిశుద్ధాత్ముడు అపొస్తలులపై కుమ్మరింపబడగా వారందరు ఆ ఆత్మ వారికి వాక్శక్తి ననుగ్రహించినకొలది అన్యభాషలతో మాటలాడసాగిరి. ఆ సమయములో అక్కడ కూడియున్న వారందరు వారివారి భాషలలో అపొస్తలులు దేవుని వాక్యమును బోధించగా వినుటమాత్రమే గాక యించుమించు మూడువేలమంది సువార్తకు విధేయులై సంఘమునకు చేర్చబడుట మున్నగు విషయములను అపొ. కార్యముల గ్రంథము రెండవ అధ్యాయములో చూడగలము. "అప్పుడు ప్రతి వానికి భయము కలిగెను.

మరియు అనేక మహాత్కార్యములును సూచక క్రియలును అపొస్త
లుల ద్వారా జరిగెను" (అ.కా. 2:43). మనము ఈ క్రింది విషయ
ముల నొకమారు పరిశీలింతము:-

1) క్రీస్తు తన అపొస్తలులమీదికి ఆదరణకర్త లేదా పరిశుద్ధా
త్మను పంపబోవుచున్నాడు.

2) క్రీస్తు వారికి ఏయే సంగతులను బోధించెనో వాటి నన్ని
టిని ఆయన జ్ఞాపకము చేయును.

3) ఆయన (పరిశుద్ధాత్ముడు) సర్వసత్యములోనికి వారిని నడి
పించును.

4) ఆయన వారికి అన్యభాషలలో మాట్లాడు శక్తిని అనుగ్ర
హించును.

5) దేవుని చిత్తము నెరవేర్చుటకు ఆయన యొద్దనుండి సంపబడె
నని నిరూపించుటకు సూచక క్రియలను చేయగల శక్తిని ఆయన (పరి
శుద్ధాత్మ) వారికీయును.

పై విషయములను జ్ఞప్తియందుంచుకొని వాటికి సంబంధించిన
ఈ క్రింది విషయములనుగూడ పరిశీలింతము. పేతురును కడమ అపొ
స్తలులును యేసుక్రీస్తు జీవముగల దేవుని కుమారుడని ఒప్పుకొనిన
పిమ్మట వారితో క్రీస్తు యిట్లనుచున్నాడు. "మరియు నీవు పేతురువు;
ఈ బండమీాద నా సంఘమును కట్టుదును. పాతాళలోక ద్వారములు
దాని యెదుట నిలువనేరవని నేను నీతో చెప్పుచున్నాను. పరలోక
రాజ్యముయొక్క తాళపుచెవులు నీకిచ్చెదను. నీవు భూలోకమందు దేనిని
బంధించుదువో అది పరలోకమందును బంధింపబడును. భూలోకమందు
దేనిని విప్పుదువో అది పరలోకమందును విప్పబడునని అతనితో
చెప్పెను" (మత్త 16 : 18, 19). నీవు సజీవుడగు దేవుని కుమారుడ
వైన క్రీస్తువని పేతురు చేసిన ఒప్పుకోలు అను బండపై నా సంఘ

మును కట్టుదునని యేసుక్రీస్తు పేతురుతో చెప్పిన విషయమును జాగ్రత్తగా గమనించుము. పిమ్మట ఆయన యింకను యిట్లనుచున్నాడు. పరలోక రాజ్యముయొక్క తాళపుచెవులు అనగా ఒకడు రాజ్యములో లేదా సంఘములో ఎట్లు సభ్యుడు కాగలడో నిర్ణయించు అధికారము; మరియు ఆ అధికారమువలన వారు ఏమి బోధించుదురో అది పరలోకమందు బంధింపబడును, వారు వేటిని వదలివేయుదురో యవి పరలోకమందును అక్కరకు రానివిగా ఎంచబడునను విషయమును పై వాక్యభావముల వలన మనము గ్రహింపవచ్చును. మరియొక మాటలో చెప్పవలెనన్న శిష్యులు పరిశుద్ధాత్మచే ప్రేరేపింపబడి నడిపింపబడి యున్నారను సంగతిని మనము గ్రహింపవలయును.

మత్తయి సువార్త చివరి భాగంలో గొప్ప ఆజ్ఞను యిచ్చుచు యేసుక్రీస్తు తన అపొస్తలులతో ఈ విధముగా చెప్పుచున్నాడు: "పరలోకమందును భూమిమీదను నాకు సర్వాధికార మియ్యబడి యున్నది. కాబట్టి మీరు వెళ్ళి, సమస్త జనులను శిష్యులనుగా చేయుడి; తండ్రి యొక్కయు కుమారుని యొక్కయు పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మ మిచ్చుచు నేను మీకు ఏయే సంగతులను ఆజ్ఞాపించితినో వాటి నన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి. ఇదిగో యుగ సమాప్తి వరకు సదా కాలము నేను మీతో కూడ ఉన్నానని వారితో చెప్పెను" (మత్తయి 28:18-20). ఇంకను ఆయన యిట్లనుచున్నాడు. "మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్త ప్రకటించుడి. నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును, నమ్మనివానికి శిక్ష విధింపబడును" (మార్కు 16:15, 16). పరలోకమందును భూలోకమందును సర్వాధికారము నాకు యివ్వబడినదని క్రీస్తు చెప్పిన మాటను గమనింపుము. సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్త ప్రకటింపుమని క్రీస్తు ఆజ్ఞాపించుచున్నాడు. నేను మీకు ఏయే సంగతులను ఆజ్ఞాపించితినో వాటినన్నిటిని గైకొనవలెనని

వారికి ఆజ్ఞాపించుడని చెప్పెను. గనుక వారు బోధించిన విషయములను గూర్చి చదివినపుడు యొకడు రక్షింపబడుటకు ఏమి చేయవలెనో మనము వివరించగా పై విషయము క్రీస్తు చెప్పియుండలేదని ఎవరైనా అంగీకరింపకుందురురా? పై విషయమును క్రీస్తు చెప్పియున్నాడనునది సత్యమై యున్నది. యేసుక్రీస్తు అపొస్తలులతో మాట్లాడుచు తాను చెప్పిన విషయములన్నియుగూడ బోధించుమని ఆజ్ఞాపించెను. అపొస్తలులను సర్వసత్యములోనికి నడిపించునట్లు ఆయన పరిశుద్ధాత్మను పంపగా వారు వాక్యమును స్థిరపరచిరి. కాబట్టి వారు వ్రాసిన విషయములను గూర్చి మనము చదివినపుడు అవి ఖచ్చితముగా సత్యమని మనము అంగీకరింపవలసియున్నది. ఏలయనగా అది సత్యమే.

ఈ సందర్భములో అపొస్తలులతో మాటలాడుచున్న క్రీస్తు మాటలను గమనింపుము. "—దాసుడు తన యజమానునికంటె గొప్పవాడు కాడని నేను మీతో చెప్పిన మాట జ్ఞాపకము చేసికొనుడి. లోకులు నన్ను హింసించిన యెడల మిమ్మును కూడ హింసింతురు. నా మాట గైకొనినయెడల, మీ మాటకూడ గైకొందురు" (యోహా 15:20). క్రీస్తు ఏమి చెప్పెనో నీవు యిపుడు విని యున్నావా? ఆయన యిట్లు అనుచున్నాడు. "వారు నా మాట గైకొనినయెడల మీమాట కూడ గైకొందురు." యింకొక మాటలో చెప్పవలెనన్న వారు నా బోధకు విధేయత చూపినట్లయితే అదే విధముగా మీ బోధకుగూడ విధేయత చూపుదురు. ఎందువలన? ఎందుకనగా అపొస్తలులు క్రీస్తు పక్షమున అధికారముతో మాట్లాడుటకు పరిశుద్ధాత్మ నడిపింపును ఆయన వారికి అనుగ్రహించియున్నాడు. అందువలన అపొస్తలుల బోధను తిరస్కరించువారందరు యేసుక్రీస్తును తృణీకరించుచున్నారను విషయము మనకు స్పష్టముగా కన్పించుచున్నది.

లేఖనము దైవావేశమువలన కలిగెనని పౌలు చెప్పుచున్నాడు

(II తిమో 3 : 16, 17). పేతురు యిట్లనుచున్నాడు. "ఏలయనగా ప్రవచనము ఎప్పుడును మనుష్యుని ఇచ్ఛనుబట్టి కలుగలేదుగాని మనుష్యులు పరిశుద్ధాత్మవలన ప్రేరేపింపబడిన వారై దేవుని మూలముగ పలికిరి" (II పేతు 1 : 21). హెబ్రీ గ్రంథకర్త యిట్లు వ్రాయుచున్నాడు. "కావున మనము వినిన సంగతులను విడిచిపెట్టి కొట్టుకొని పోకుండునట్లు వాటియందు మరి విశేష జాగ్రత్త కలిగియుండవలెను. ఎందుకనగా దేవదూతలద్వారా పలుకబడిన వాక్యము స్థిరపరచబడినందున, ప్రతి అతిక్రమమును అవిధేయతయు న్యాయమైన ప్రతిఫలము పొంది యుండగా ఇంత గొప్ప రక్షణను మనము నిర్లక్ష్యము చేసిన యెడల ఏలాగు తప్పించుకొందుము. అట్టి రక్షణ ప్రభువు బోధించుటచేత ఆరంభమై, దేవుడు తన చిత్తానుసారముగా సూచక క్రియలచేతను, మహత్కార్యములచేతను, నానా విధములైన అద్భుతములచేతను, వివిధములైన పరిశుద్ధాత్మ వరములను అనుగ్రహించుటచేతను, వారితో కూడ సాక్ష్యమిచ్చుచుండగా వినిన వారి చేత మనకు దృఢపరచబడెను" (హెబ్రీ 2:1-4). ఎవరు వారు? వారు అపొస్తలులని మనకు అర్థమగుచున్నది.

యేసుక్రీస్తు యొక్క ఏకైక సువార్తను తాను ప్రకటించెనని పౌలు చెప్పుచున్నాడు. అతడు యింకను యిట్లనుచున్నాడు: మీకు ప్రకటింపబడిన సువార్త గాక వేరొక సువార్తను మేమైనను మరో లోకమునుండి వచ్చిన యొక దూతయైనను మీకు ప్రకటించిన యెడల అతడు శాపగ్రస్తుడవునుగాక. చివరకు పౌలు యిట్లనుచున్నాడు. "మనుష్యుల వలన నేను దానిని పొందలేదు, నాకెవడు దాని బోధింపను లేదుగాని యేసుక్రీస్తు బయలు పరచుట వలననే అది నాకు లభించినది" (గలతి 1:12).

అపొస్తలుడైన యోహాను యిట్లు వ్రాయుచున్నాడు. "ఈ గ్రంథమందున్న ప్రవచన వాక్యములను విను ప్రతివానికి నేను సాక్ష్య

మిచ్చునది ఏమనగా - ఎవడైనను వీటితో మరి ఏదైనను కలిపిన యెడల, ఈ గ్రంథములో వ్రాయబడిన తెగుళ్ళు దేవుడు వానికి కలుగజేయును; ఎవడైనను ఈ ప్రవచన గ్రంథమందున్న వాక్యములలో ఏదైనను తీసివేసిన యెడల, దేవుడు ఈ గ్రంథములో వ్రాయబడిన జీవవృక్షములోను పరిశుద్ధ పట్టణములోను వానికి పాలు లేకుండ చేయును" (ప్రక 22:18, 19).

ఈ అంశమును ముగించుకొనుటకు ముందు — నూతన నిబంధన గ్రంథకర్తలందరు దైవావేశము వలన ఆ గ్రంథమును వ్రాసియున్నారనియు, వారు చెప్పునది అంగీకరించుట క్రీస్తు చెప్పిన విషయముల నంగీకరించుటతో సమానమనియు మరియు వారిని అంగీకరింపకపోవుట క్రీస్తును అంగీకరింపకపోవుటతో సమానమనియు మనము గ్రహించితిమి. గనుక మనము ఏ ఒక్కరిని అంగీకరించిన ఇరువురిని అంగీకరించినట్లగును. మరియు ఏ ఒక్కరిని తృణీకరించిన ఇరువురను తృణీకరించినట్లగును. అపొస్తలుల బోధను అంగీకరింపనివాడు పరిశుద్ధాత్మను కూడ అంగీకరించుటలేదు. మరియు సర్వసత్యములోనికి నడిపించుటకు క్రీస్తు పంపిన పరిశుద్ధాత్మను, క్రీస్తును కూడ అంగీకరించుట లేదు.

దయచేసి ఈ విషయములను గూర్చి ఆలోచించండి. లేఖనములను శ్రద్ధగా చదువుము, లేఖనములయందు విశ్వాసముంచుము. వాటికి విధేయుడవుగా నుండుము. లేఖనములన్నిటిని అంగీకరింపుము. అన్నిటికి పైగా లేఖనములన్నియు దైవావేశము వలననే కలిగినవని జ్ఞాపకము చేసికొనుము.

---

## రక్షణ అద్భుతము

### *(The Miracle of Salvation)*

రక్షణ పొందడానికేమి చేయాలనే ప్రశ్నకు బైబిలులో పలు జవాబులు కనబడ్డాయి. ఒక్కొక్కడు ఒక్కొక జవాబును గైకొని

అనేకులవలె పలువిధాలుగా పోవాలా? మార్పుజెందిన వారి సందర్భాలన్నిటిని చదివి క్రొత్త నిబంధనలో స్వవిరుద్ధ సంగతి యేమైనా యున్నదేమో మనం చూడనవుసరం లేదా? అంతేకాదు మార్పుజెందినవారి ప్రతి సందర్భములోను మిళితమైయున్నదేదో చూచి దానినే మనం చేయనక్కర లేదా?

రక్షణ ఉచితవరమని అందరు గ్రహిస్తారనే నా ఉద్దేశం. దాన్ని మనం సంపాదించుకోలేము, దానికి పాత్రులము కాము. మనం పీల్చు గాలివంటిది అది. అది ఉచితం. దానికొరకు మనం డబ్బివ్వలేము, దానిని మనం కొనము, కాని దానిని మనం పీల్చుకోనడం అత్యవుసరం.

క్రీస్తు సిలువ వేయబడి మృతులలోనుండి తిరిగి లేచిన తరువాత ఆయన అపొస్తలులు చేసింది, చెప్పిందీ చరిత్రగా అపొస్తలుల కార్యముల గ్రంథం మనకున్నది. కపట మనస్కులై బుద్ధిపూర్వకముగా తప్పు జవాబిచ్చుచున్నారని నేనెవరినీ నిందించదలచుకోలేదు గాని "రక్షణ పొందుటకు నేనేమి చేయవలెను?" అను ప్రశ్నకు అనేకులు యిచ్చు జవాబు యేసును ఆయన అపొస్తలులును బోధించిన దానికి విరుద్ధముగా యున్నది!

పరలోకం వెళ్ళడమా లేదా క్రొత్త నిబంధనతో విరుద్ధముగా యున్న బోధ ననుసరించడమా? ఇందులో యేది నీకు ప్రాముఖ్యమైనది?

దేవునితో మనం ఎట్లు నిలబడి యున్నామో తెలియ జేయడానికి మన భావాలు క్షేమకరమైన మార్గదర్శి కాజాలవని మనం ఒప్పుకోవాలి. క్షమాపణ మన హృదయాల్లో కాదుగాని పరలోకంలో జరుగుతాది.

యుద్ధంలో తన కుమారుడు చనిపోయాడని విని దుఃఖించిన తల్లిని గూర్చి మనం వినియున్నాము. స్మారకకూటమైపోయిన తరువాత తన కుమారుడు ఇక లేడు, ఖచ్చితంగా చనిపోయాడని భావించింది. గాని తన

కుమారుడు చనిపోలేదుగాని యుద్ధఖైదీగా పట్టుబడ్డాడని సజీవుడై ఇంటికి తిరిగి వచ్చుచున్నాడని ఆమెకు తెలియజేయబడింది. ఆమె ఏమి చేయాలి? తన కుమారుడు నిజంగా చనిపోయాడని నమ్మాలా లేక అతనిని సంతోషంతో అంగీకరించాలా? నిజానికి మనకేమి తెలియజేయబడతాదో దానికే మనం నమ్ముతాము. రక్షణనుగూర్చి నిర్మలమైన మనస్సాక్షి మనకుంటే మన హృదయాల్లో మనం ఆనందించగలము (1 పేతురు 3:21).

పాపక్షమాపణ కొరకు, క్రీస్తులో ప్రవేశింపజేయడానికి అపొ. కా. 2:38లో చెప్పబడినట్లు బాప్తిస్మం అవుసరం లేకపోతే, అపొస్తలుల కార్యముల గ్రంథములో మార్పుజెందినవారి ప్రతి సందర్భములోను అది ఎందుకు చెప్పబడింది?

మనం కృపవలన రక్షింపబడుదుము (ఎఫెసీ 1:7-2:5). మనం విశ్వాసము వలన రక్షింపబడుదుము (ఎఫెసీ2:8; హెబ్రీ 11:6). విశ్వాసముంచుట వలన రక్షింపబడుదుము (అపొ.కా. 16:31-33; యోహాను 1:12). మనం ఉపదేశమువలన రక్షింపబడుదుము (1 తిమో 4:16). నీటి బాప్తిస్మము మనలను రక్షించును (1 పేతురు 3:21). నిరీక్షణ వలన రక్షింపబడుదుము (రోమా 8 : 24). విధేయత వలన మనం రక్షింపబడుదుము (హెబ్రీ 5:9).

అయితే వీటిలో ఏ ఒక్కదానివలన మాత్రమే మనము రక్షింపబడజాలము.

## క్రొత్త జీవితం

మనము క్రీస్తుతో లేచినప్పుడు క్రొత్త జీవితము ఆరంభించబడును (రోమా 6:3, 4). మనం విశ్వసించినప్పుడు క్రొత్త జీవితము ఆరంభించునని బైబిలులో ఎక్కడా చెప్పబడలేదు. మనం నూతన జీవి

తము గలిగి నడుచుకొనునట్లు లేపబడితిమని బైబిలు ప్రత్యేకంగా చెప్పు చున్నది (రోమా 6:3, 4).

క్రైస్తవులు కాకముందు లోకస్థులవలె మనముంటిమి. అయితే మనం సువార్తను విని, విశ్వసించి మన పాపముల విషయమై మారు మనస్సు పొందినప్పుడు మన గత పాపపు తత్వం విషయములో మర ణించడానికి ఇచ్ఛయించుకొని క్రీస్తును ఒప్పుకొనుచు నీటి సమాధిలో పాతిపెట్టబడితిమి.

బాప్తిస్మములో మనం క్రీస్తుని కలసికొంటామని, ఆయనతో పాతిపెట్టబడి నూతన జీవముకలిగి నడుచుకొనుటకు లేపబడతామని రోమా 6:3, 4 చెప్పుచున్నది.

ఆయనకు విధేయులైన వారందరికి క్రీస్తు నిత్యరక్షణకు కారకు డని హెబ్రీ 5:9 చెప్పుచున్నది. బాప్తిస్మము ఇప్పుడు మనలను రక్షించుచున్నదని 1 పేతురు 3:21 విశదంగా చెప్పుచున్నది. "గనుక నీవు తడవుచేయుట ఎందుకు? లేచి ఆయన నామమును బట్టి ప్రార్థన చేసి బాప్తిస్మముపొంది నీ పాపములను కడిగివేసికొనుము" (అపొ. కా. 22:16).

అపొ. కా. 2:38, అపొ. కా. 13, 16వ అధ్యాయములను పూర్తిగా చదువుము. చెరసాల అధిపతి విశ్వసించాలని చెప్పబడింది. అతడెట్లు విశ్వసించాడో ఆ అధ్యాయమంతా చదువుము. రోమా 6:16, 17 లను చదువుము: "దేనికి మీరు లోబడుదురో దానికే దాసులగుదురని మీరెరుగరా?". మనము ప్రభువుకు లోబడినప్పుడు నీతికి దాసుల మవుదుమని ఈ లేఖనములు మనకు చెప్పుచున్నవి.

ఈ వివరాలన్నీ నీ బైబిలులో ఎల్లప్పుడు ఉన్నాయి. వీటిని నీ బోధకుడు నీకెందుకు చెప్పలేదు? అంత ప్రాముఖ్యమైన సంగతిని చెప్పకుండా ఎవడైనా ఎట్లుండగలడు? ఇదొక క్రొత్త బోధ కాదు.

క్రొత్త నిబంధన లిఖించబడిన నాటినుండి అది దానిలోనే యున్నది. బైబిలుచొప్పున కాని బోధను చేయుటవలన బహుశ ఏమైనా లాభమున్నదా? అంతరింగిక మార్పుకు బాప్తిస్మము బహిరంగ సాక్ష్యమని బైబిలు ఎన్నడు చెప్పలేదు. అది మానవుల బోధ. ఒకడు క్రీస్తులో ప్రవేశించడానికే గాని డినామినేషన్‌లో సభ్యుడగుటకు బాప్తిస్మము పొందలేదు.

## విశ్వాసముతోకూడిన విధేయత

నయమాను విశ్వసించినప్పుడు గాక, విధేయత చూపి యొర్దానులో మునిగినప్పుడు కుష్ఠురోగమునుండి శుద్ధుడయ్యాడు (2 రాజులు 5). ఆతడు మునుగుటవలన క్రియ చేసాడని, విధేయత చూపిన తరువాత స్వస్థతను తనకుగా తాను సంపాదించుకొన్నాడని చెప్పడం బుద్ధిహీనత కాదా? ఇశ్రాయేలీయులు విశ్వసించినంత మాత్రముననే గాక విధేయత చూపినందువలన యెరికో గోడలు కూలాయి. వారు ప్రదక్షిణం చేసినందువలన తమకుగా తాము విజయాన్ని సంపాదించుకొన్నారని ఎవడు తలంచడు. వారు విశ్వసించి విధేయత చూపినప్పుడు దేవుడా పట్టణాన్ని వారికిచ్చాడు (యెహోషువ 6).

ఏదెములో అవిధేయతవలన పాపముద్భవించింది. దేవునితో తిరిగి మనకు సంబంధం ఏర్పడాలంటే విధేయత అవుసరం. రక్షణను సంపాదించుకొనే ఒక మార్గము బాప్తిస్మము కాదు. విశ్వసించుట ఎట్లుకాదో అట్లే బాప్తిస్మము ఒక క్రియ కాదు (యోహాను 6:29). దయ్యములు రక్షించబడతాయా? దయ్యములు నమ్మి వణకుచున్నాయని యాకోబు 2:12 చెప్పుచున్నది.

క్రీస్తులోనికి మనము విశ్వసించవచ్చునని, పాపక్షమాపణ నిమిత్తం నమ్మవచ్చునని బైబిలులో ఎక్కడ చెప్పబడింది? అయితే మనం క్రీస్తులోనికి, పాపక్షమాపణ నిమిత్తం బాప్తిస్మం పొందాలని

చెప్పబడింది (అపొ. కా. 2:38). బాప్తిస్మమునకు ముందు మారుమనస్సు ఒప్పుకోలు అవుసరమని చెప్పబడినను క్రీస్తులోనికి మారుమనస్సు పొందాలని ఒప్పుకోవాలని చెప్పబడలేదు.

మనము బైబిలు బోధను మన్నించాలని నా ఆసక్తి. బైబిలుతో సమన్వయించని బోధ మన హృదయాల్లో స్థావరం కల్పించుకొనుటకు తగినది కాదు. బైబిలు చెప్పేది మనకర్థం కానట్లయితే అదేమి చెప్పుచున్నదో తెలిసికొనడం కష్టం (యోహాను 17:17).

ఒకడు తన ఊహను బట్టి చెప్పుటవలన లేఖనములు కలుగలేదని 2 పేతురు 1:20-21 చెప్పుచున్నది. నావలె నీవును బైబిలును చదివి గ్రహించుకోగలవు. బైబిలు భావాన్ని తెలియజెప్పడానికి ఒక పండితుడు గాని వేదాంతి గాని మనకవుసరం లేదు (యోహాను 16:13).

—క్లైడెన్ సింక్లైయర్

---

## "మా సువార్త .... మరుగుచేయబడి యున్నది"

(2 కొరింథి 4 : 3)

సంపూర్ణమైయున్న దేవుని చిత్తమును క్రీస్తు పరిశుద్ధాత్మ ద్వారా అపొస్తలులకు బయలు పరచెను. అపొస్తలులు సంపూర్ణాధికారముతో క్రీస్తు సువార్త సత్యమును క్రమముగా బోధించి, దానంతటిని ఒక గ్రంథముగా వ్రాసిరి. అదియే 27 పుస్తకములుగల క్రొత్త నిబంధన గ్రంథము.

అయితే సాతాను హవ్వను మోసగించినట్లు సంఘమును కూడా మోసగించుచున్నాడు, ఎట్లనగా :

అపొస్తలులు ప్రకటించిన సువార్తను మరుగుపరచి, మరియొక సువార్తను, మరియొక క్రీస్తును, మరియొక ఆత్మను ప్రకటించుచున్నాడు (2 కొరి 11:2-4, మత్త 7:15-16, గల 1:6-9).

అనేక మంది నాయకులు అపవాది అనుచరులై మరొక సువార్తను బోధిస్తున్నారు. అందుచే క్రీస్తు సువార్త మరుగు చేయబడియున్నది.

ఒక మాట, మీరు ఎవరి సువార్త వినుచున్నారు? ఎవరిని ఆరాధిస్తున్నారు? ఏ ఆత్మ వలన నడిపింపబడుచున్నారు ? (గల 1 : 6; 1 యోహా 4:2-3, 6; 1 తిమో 4:1-2).

మన ఆత్మీయ జీవితము క్రీస్తునందు సుస్థిరముగా భద్రపడియుండు నిమిత్తము పై ప్రశ్నలకు సరియైన జవాబును కనుగొనుట చాలా అవసరము.

మనము నిత్యమోక్షమును వెదకుచూ నిత్యనరకమునకు పోవుట ఎంత దుఃఖము ? (మత్త 7:22-23, లూకా 13:24-30).

మరియు మనుష్యుల దయకొరకు కాదు, దేవుని దయకొరకే మనము జీవించాలి (గల 1:10).

1. క్రొత్త నిబంధన గ్రంథమునుండి మాత్రమే క్రీస్తునందు మన ఆత్మీయజీవితమునకు అవసరమయిన క్రీస్తు సువార్త సత్యము యొక్క క్రమమును తెలుసుకొనగలము (2 తిమో 3:14-17).

దర్శనములో, స్వప్నములో, మగతలో, వెలుగులో, చీకటిలో, ఆకాశములో క్రీస్తు సత్యమును మనం పొందలేము.

క్రీస్తు అపొస్తలులు పరిశుద్ధాత్మ వలన దర్శనములు, ప్రత్యక్షతలు, ప్రేరేపణలు నడిపింపులద్వారా సర్వసత్యమును పొంది గ్రంథముగా వ్రాసిరి (2 థెస్స 2:15, ఎఫె 3:2-3).

ఈ బోధ పరిశుద్ధులకు అనగా క్రీస్తుసంఘము కొరకు ఒక్కసారే అప్పగింపబడెను (యూదా 1:3).

ఈ మాటలతో ఏమీ కలుపకూడదు, తీసివేయకూడదు అని ఖండితముగా ఆజ్ఞాపించబడెను (ప్రక 22:18-19; హెబ్రీ 2:3-4, 1 యోహా 1:1-4, 2 పేతు 1:15-21).

గొప్ప విశేషము ఏమనగా అది చదివి గ్రహించగలుగునట్లుగా వ్రాయబడెను. కడవరకు ఈ చట్టాన్నే ఒప్పుకోవలెను (2 కొరి 1:13).

క్రీస్తు బోధ అవును, అవును అంటూ కాదు, కాదన్నట్లు లేదు (2 కొరి 1:18, 19).

మనము సత్యవాక్యాన్ని జాగ్రత్తగా చదవాలి. జాగ్రత్తగా విభజించి బోధించాలి (1 తిమో 4:13, 2 తిమో 2:15).

2. స్వస్థత వరము, ప్రవచన వరము, భాషలు మాట్లాడే వరము, భాషల అర్థముచెప్పే వరము మొ॥వి ఆ కాలమందు సంఘములో నమ్మకముగాను, బలముగాను, నిజముగాను ఉండేవి.

ఎందుకనగా వాటివలన వాక్యము స్థిరపరచబడుచుండెను (మార్కు 16:20, హెబ్రీ 2:3-4).

అట్లు నమ్మకమైన సూచన క్రియలద్వారా వాక్యము స్థిరపరచబడి, గ్రంథముగా వ్రాసి పూర్తిచేయబడి యున్నందున (యాకో 1:25) అద్భుత వరములు సంఘములో ఆగిపోయెను. విశ్వాసము, నిరీక్షణ, ప్రేమ సంఘములో ప్రభువు రాకడవరకూ ఉండును. (హెబ్రీ 2:2, 1 కొరి 13:8-13).

దేవుని జ్ఞానము, వరమువలన కాక, లేఖనములనుండి సంఘము నేర్చుకొనును (2 తిమో 3:14-15).

అయితే ఇంకను అద్భుత వరములు పొందుచున్నామనేవారున్నారు. గాని క్రియలుమాత్రం లేవు. ఈలాటి వారిని గూర్చియే "అక్రమము చేయువారలారా..." అని క్రీస్తు పిలచెను (మత్త 7:22-23).

3. క్రైస్తవ ఆరాధనలో డ్రమ్ములు ఇతర వాయిద్యాలు వాయిస్తూ చప్పట్లు కొట్టుచూ పాడుట క్రీస్తు సువార్త సత్యములో వ్రాయబడలేదు.

ఆత్మతోను సత్యముతోను ఆరాధించాలని వ్రాసిరి. బోధించిరి (యోహా 4:24, 1 కొరి 14:15, యాకో 5:14, కొల 3:16).

చేతులతో సేవించుట క్రైస్తవ ఆరాధన కాదు (అ.కా.17:25).

4. ప్రజలలో ప్రకటించి బహిరంగముగా జరిపే ఉపవాస కూటములు క్రీస్తు సంబంధులు చేయకూడదు. క్రైస్తవులు జరిపే ఉపవాస విధము వేరు (మత్త 6:16-18).

5. యూదులు పెంతెకొస్తు పండుగకై యెరూషలేములో ఉండగా అదే పట్టణంలో పరిశుద్ధాత్మ అపొస్తలులపైకి వచ్చెను, యూదులు తమ పెంతెకొస్తు పండుగను విడిచి అపొస్తలుల యొద్దకు వచ్చారు. అపొస్తలులు వివరించే దేవుని గొప్ప కార్యాలు విసిన యూదులు మూడువేలమంది పాపక్షమాపణ కొరకు బాప్తిస్మము పొందారు. మరలా వారు పెంతెకొస్తు పండగ చేయలేదు. అపొస్తలుల బోధయందు ఎడతెగక యుండిరి. వారు "పెంతెకొస్తు మిషను" లేక పెంతెకొస్తు సంఘము అని గాని, పెంతెకొస్తు వారని కాని ఎన్నడూ పిలువబడలేదు. పెంతెకొస్తు అనుభవము అను మాటే పరిశుద్ధాత్మ అపొస్తులకు బయలుపర్చలేదు. యూదులైనా అన్యజనులైనా, క్రీస్తులో క్రీస్తువారుగానే ఉన్నారు గాని పెంతెకొస్తు వారని పిలువబడలేదు (అ.కా. 2:1-47).

మరియు క్రీస్తు సంబంధులు, హెబ్రోను సహవాసమని, సియోను ఫెలోషిప్ అని, బేతేలు మందిరమనికూడా పిలువబడక క్రైస్తవులు క్రీస్తుసంఘములని మాత్రమే పిలువబడిరి.

6. పితరులు అరణ్యములో భుజించిన మన్నాను గూర్చి యూదులు క్రీస్తుతో వాదం పెట్టుకున్నారు.

మన్నా కాదు పరలోకము నుండి లోకము కొరకు వచ్చిన జీవాహారము నేనే అని క్రీస్తు చెప్పాడు (యోహా 6:33, 47-56, 66-69).

అప్పటినుండి మన్నా అభిమానులంతా క్రీస్తును విడిచి వెళ్ళిపోయారు.

జీవాహారమైన క్రీస్తు నిత్యజీవపు మాటలు నమ్మిన పన్నెండు మంది శిష్యులు క్రీస్తును వెంబడించి క్రీస్తుకొరకే జీవించారు. వారిలో ఒకడు అపవాది ఏజంటు.

ఏ కాలమందైనా, ఏ దేశమందైనా క్రైస్తవులు క్రీస్తువారే గాని మన్నావారు కాదు. క్రీస్తు సంఘంమన్నా సంపూర్ణ సువార్త పరిచర్యకొరకు కాక, క్రీస్తు సువార్త పరిచర్యకొరకే జీవించాలి (అ.కా. 11:26, 1 కొరి 3:19-23, కొల 1:27).

క్రీస్తు పేరులేని ఏ సంఘం, సహవాసం, పరిచర్య మన ఆత్మీయ సంబంధమగు క్రైస్తవ్యములో అంగీకరించకూడదు.

7. క్రీస్తునందున్న సహోదరులు ఒకరికి ఒకరు "వందనములు" చెప్పుకొనవలెనని పరిశుద్ధాత్మ బయలుపరచెను (ఫిలి 4:21, 2 కొరి 13:13, కొల 4:18, 2 థెస్స 3:17).

దేవుని ఆజ్ఞకంటె సాతాను సందేశము హవ్వకు ఇంపుగా ఉన్నందున ఆమె దేవుని సన్నిధికి దూరమైనది.

అపొస్తలులు ప్రకటించిన క్రీస్తు సువార్త క్రమము చొప్పున గాక మరియొక సువార్త పరలోకంనుండి వచ్చిన యొకదూత చెప్పినను నమ్మవద్దని పరిశుద్ధాత్మ ఖండితంగా ఆజ్ఞాపించెను (గల 1:7-9).

మీరు వినుచున్న బోధ, మీరు ఆచరించే సిద్ధాంతము, మీరు కూడుకొనే సంఘము, సహవాసము మొ॥వన్నీ లేఖనమందుగల ఉపదేశ క్రమమును అనుసరించి క్రీస్తు సువార్తను ప్రకాశింపజేసిన అపొస్తలుల బోధను అనుసరించి ఉన్నదీ లేనిదీ లేఖనములలో పరిశోధించండి. క్రీస్తు సంఘములన్నియు మీకు వందనములు చెప్పుచున్నవి (రోమా 16:16).

—పాల్ గూటం, గొల్లవిల్లి.

బైబిలు పాఠము :

## బైబిలు దేవుని గ్రంధమనుటకు ఆధారములు

### I ఉపోద్ఘాతము :

A. "బిబ్లాస్" అను గ్రీకు పదమునుండి బైబిలు అను పదము వచ్చెను.

B. బైబిలు అనగా "గ్రంధము" లేక "పుస్తకము" అని అర్థము.

C. బైబిలు స్వీయ సాక్ష్యము.

1. II పేతురు 1:20-21 — దేవుని మూలముగా కలిగెను.
2. II తిమోతి 3:16-17 — దైవావేశము వలన కలిగెను.

D. బైబిలు గ్రంధకర్త దేవుడే.

E. బైబిలులో ఆ గ్రంధకర్తయైన దేవుని జ్ఞానము కనబడుచున్నది.

### II పాఠము :

A. బైబిలు మానవాతీతమైన జ్ఞానము కలిగియున్నది.

1. సైన్సుకు సంబంధించిన విషయాలు.

a. ఆది 9 : 4 — "రక్తమే దాని ప్రాణము" అని మోషే క్రీ॥పూ॥ 1500 సం॥లో వ్రాసెను.

b. యోబు 26:7 — "భూమి శూన్యములో వ్రేలాడుచున్నది" అని యోబు క్రీ॥పూ॥ యించుమించు 1400 సం॥లో వ్రాసెను.

c. కీర్తనలు 8:8 — "సముద్రములో మార్గములు కలవు" అని దావీదు క్రీ॥పూ॥ 1000 సం॥లో వ్రాసెను.

d. యెషయా 40:22 – "భూమి గుండ్రముగా వున్నది" అని యెషయా క్రీ॥ పూ 720 సం॥ లో వ్రాసెను. మోషే, యోబు, దావీదు, యెషయా శాస్త్రజ్ఞులు కారు. అయినను వారు దేవుని జ్ఞానము కలిగినవారై వ్రాయగలిగిరి.

2. ప్రవచనములు వాటి నెరవేర్పులు :

a. యెషయా 7 : 14 — "కన్యక గర్భవతియై కుమారుని కనును" అను ప్రవచనము క్రీ.పూ. 720 సం॥లో ప్రవచించబడి, మత్తయి 1:21లో నెరవేరెను.

b. మీకా 5:2 — "క్రీస్తు బెత్లెహేంములో పుట్టును" అను ప్రవచనము క్రీ.పూ. 720 సం॥లో ప్రవచించబడి, మత్తయి 2:5 నందు నెరవేరెను.

3. దానియేలు 2:1-44 ప్రపంచమును ఏలు రాజ్యములను గూర్చిన ప్రవచనము.

| | | |
|---|---|---|
| i) శిరస్సు | బంగారము | బబులోను రాజ్యము క్రీ.పూ.606 నుండి 532 వరకు |
| ii) భుజములు ఛాతి | వెండి | మాదీయ పారశీక రాజ్యము క్రీ.పూ.526 నుండి 332 వరకు |
| iii) ఉదరము తొడలు | యిత్తడి | గ్రీకు సామ్రాజ్యము క్రీ.పూ.331 నుండి 146 వరకు |
| iv) మోకాళ్లు పాదములు | యినుము మట్టి | రోమా సామ్రాజ్యము క్రీ.పూ. 146 నుండి క్రీ.శ.400 |

పర్వతము నుండి తీయబడిన రాయి - దేవుని రాజ్యము యెషయా, మీకా, దానియేలు అను ప్రవక్తలు కొన్ని వందల సంవత్సరముల తరువాత జరుగబోవు సంగతులను దేవుని జ్ఞానముచేత చెప్పగలిగిరి.

B. గ్రంథకర్తల ఐక్యత:

a. ఒక అంశముపై కొందరు ఏకాభిప్రాయము కలిగి యుండుట అసంభవము.

b. బైబిలు 66 పుస్తకములను, 40 మంది మనుష్యులు, 1600 సం॥ల కాలములో వ్రాసిరి. అయినను బైబిలులో భేదములు కానరావు.

c. బైబిలు వ్రాసినవారు ఒక కాలమునకు, భాషకు, విద్యకు, దేశమునకు, స్థితికి సంబంధించినవారు కారు.

d. వీరు ఒకే దైవ జ్ఞానముతో ప్రేరేపించబడుట వలన ఐక్యతను కలిగియుండిరి.

C. బైబిలు మానవ కల్పితము కాదు.

1. చరిత్రకు సంబంధించిన ఆధారములు.

a. చరిత్ర కల్పితము కాదు.

b. బైబిలులో ఐగుప్తు, కనాను, బబులోను మొ॥ అనేక దేశముల చరిత్ర కలదు.

c. కల్పనా కథల్లో చరిత్ర కానరాదు.

2. త్రవ్వకాలలో బయలు పడిన ఆధారములు.

a. నోవాహుకాలమునాటి ఓడ, జలప్రళయము.

b. అబ్రాహాము నివసించిన ఊరను పట్టణము.

c. యోసేపు కాలము నాటి ధాన్యపుగాదులు.

d. ఐగుప్తీయుల శవపేటికలు (మమ్మీస్)

e. కల్పితములు త్రవ్వకాలలో బయలు పడవు.

3. భౌగోళిక ఆధారములు :

a. దేశములు : ఐగుప్తు, ఇశ్రాయేలు, హిందూదేశము మొదలగు దేశములు నేటికి కలవు.

b. సముద్రములు : మధ్యధరా సముద్రము, మృత సముద్రము మొదలగునవి.

c. పర్వతములు : సీనాయి పర్వతము మొ॥నవి.

d. పట్టణములు : యెరూషలేము, రోమా మొ॥నవి.

e. నదులు : నైలునది, యోర్దానునది మొ॥నవి.
బైబిలులో వ్రాయబడిన ఈ ప్రదేశములు నేటికి కలవు. గనుక బైబిలు కల్పితము కాదు.

D. గ్రంథకర్తల యథార్థత :

1. బైబిలు గ్రంథకర్తలు ధనాపేక్షతో వ్రాసినవారు కారు. మోషే, పౌలు మొ॥వారు.

2. రాజులను సంతోషపెట్టుటకు గ్రంథమును వ్రాయలేదు. దానియేలు, పేతురు, పౌలు మొ॥వారు.

3. జాతి అభిమానముతో, మతాభిమానముతో వ్రాసినవారు కారు.

4. వీరు దుర్వ్యసనములకు లోనైనవారు కాదు.

III ముగింపు :

A. పై కారణములను బట్టి బైబిలు దేవుని గ్రంథమని గ్రహించుచున్నాము.

B. దేవుని గ్రంథమునకు మనుష్యులు ఏమి కలుపరాదు, ఏమి తీసి వేయరాదు.

C. దేవుని గ్రంథము మానవుడు జీవించవలసిన విధానమును తెలుపుచున్నది.

D. బైబిలును చదివిన నిత్యజీవము పొందగలము (యోహాను 5:39).

— బి. జాషువా, ఏలూరు.

---

## ఏది నిజం? ఏది సత్యం?

పరిశుద్ధ గ్రంథము ఒకేఒక్కటి. దేవుడు ఒక్కడే. ఈనాడు ప్రజలు అనేక విధాలుగా దేవునిని ఆరాధించుచున్నారు. పరిశుద్ధ బైబిలు వ్రాయబడిన విధానమిది :

"ఒకడు తన ఊహానుబట్టి చెప్పుటవలన లేఖనములో ఏ ప్రవచనమును పుట్టదని మొదట గ్రహించుకొనవలెను" (2 పేతు 1:20-21). "తనను ఆరాధించువారు ఆత్మతో, సత్యముతో ఆరాధించువారు కావాలని తండ్రి కోరుకొనుచున్నాడు" (యోహాను 4:23-24).

ఈనాడు మతశాఖలవారు ఎవరి యిష్టానుసారంగా వారు దేవునిని ఆరాధించుచున్నారు. అందువలననే మత్తయి 15 : 6-9లో "మీరు మీ పారంపార్యాచారముల నిమిత్తమై దేవుని వాక్యము నిరర్థకము చేయుచున్నారు. ఈ ప్రజలు తమ పెదవులతో నన్ను ఘనపరచుదురుగాని వారి హృదయము నాకు దూరముగానున్నది. మనుష్యులు కల్పించు పద్ధతులు దైవోపదేశములని బోధించుచు వారు నన్ను వ్యర్థముగా ఆరాధించుచున్నారు" అని ప్రభువు చెప్పాడు. అదియునుగాక, ప్రభువా, ప్రభువా అని పిలుచు ప్రతివాడు పరలోక రాజ్యములో చేరడు గాని పరలోకమందున్న నా తండ్రి చిత్తప్రకారం చేయువాడే ప్రవేశించును అని ఆయన చెప్పాడు (మత్త 7:21). ఆయన చిత్తం దైవగ్రంథములో తేటగా కనబడుచున్నది. ఈనాడు మతశాఖలవారు

తమకు అనుకూలమైన బోధల తట్టు తిరుగుచు, మతశాఖలు ఏర్పరిచారు.
దానికి బైబిలు ఏమని బోధించుచున్నది ?

క్రీస్తు ఒక్కడే, సంఘము ఒక్కటే, బాప్తిస్మము ఒక్కటే, నిరీక్షణ ఒక్కటే, విశ్వాసము ఒక్కటే, తండ్రి ఒక్కడే (ఎఫెసీ 4:4). బైబిలులో ఇవన్నియు ఒక్కొక్కటే అని చెప్పుచున్నప్పుడు యిన్ని విశ్వాసాలెక్కడివి ? యిన్ని బాప్తిస్మములెక్కడివి? యిన్ని సంఘాలెక్కడివి? ప్రభువైన క్రీస్తు తనయందు విశ్వసించిన వారందరు ఏకముగా వుండాలని కోరాడు. కాని ఈనాడు మనుష్యులు నిర్మించుకొన్న సంఘములవలన ఒకరి పొత్తు ఒకరికి గిట్టుటలేదు. మతశాఖలవారు దైవగ్రంథాన్ని అర్థము చేసుకుంటే భేదములు లేక కలిసి వుందురు. ఈ బండమీద నా సంఘమును కట్టుదును అని క్రీస్తు మత్తయి 16 : 18లో చెప్పాడు. క్రీస్తు నా సంఘము అని చెప్పుచున్నాడు. రోమా 16 : 16 క్రీస్తు సంఘములన్నియు అని చెప్పుచున్నది. అపొ. కా. 20:28లో దేవుడు తన స్వరక్తమిచ్చి సంపాదించిన తన సంఘము అని చెప్పబడినది. అందుకే ఆ సంఘానికి శిరస్సు క్రీస్తు (కొలస్స 1:18). ఏ మనుష్యునికి శిరస్సుగా వుండే అధికారం లేదు. క్రీస్తు నాకు భూమిమీద సర్వాధికారం యియ్యబడివున్నది అని మత్త 28:18లో చెప్పాడు. గనుక సంఘము ఆయనదే. సంఘము అంటే మన పేరును పెట్టుకొన్నది కాదు. క్రీస్తు బోధకు వ్యతిరేకంగా నడుచువారు క్రీస్తు సభ్యులు కానేరరు. గావున నీవు క్రీస్తుబిడ్డవు కాగోరిన యెడల నీవు మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తం బాప్తిస్మము పొందుము (అపొ.కా. 2 : 38). నమ్మి బాప్తిస్మము పొందుము, రక్షింపబడతావు (మార్కు 16:16).

— ఎ. రాములు, ఆడవిల్లి.

---

మనవి : మీ అడ్రెసులో మార్పు వచ్చిన యెడల వెంటనే మాకు తెలియజేయండి. మీ నంబరును వ్రాయుట మరిచిపోవద్దు.

## రాజ్యము స్థాపించబడి క్రీస్తు ఇప్పుడు పాలించుచున్నాడని అది బోధించుచున్నది

(గత సంచిక తరువాయి)

8. ప్రకటన 20:1-6 వేయ్యేండ్ల పాలనను నిరూపించుటలేదు : 1. వెయ్యేండ్ల పాలన తరపున వాదించువారి నంబర్ వన్ వాక్యభాగము ప్రకటన 20:1-6, గాని అది వారి వాదనలను నిరూపించుటలేదు. ప్రకటన గ్రంథము గురుతులు, అలంకార రూపకములతో నిండియున్నదను వాస్తవము దానిని వివరించుట మరింత క్లిష్టము చేయుచున్నది. అయితే వేయ్యేండ్ల పాలనవాదుల వాదమును నిరూపించుటకు అవుసరమైన ఈ దిగువ సంగతులను గూర్చి ఆ వాక్యభాగము యేమీ చెప్పుటలేదని గమనించుము : 1) క్రీస్తుయొక్క రెండవ రాకడ 2) భూమిపై క్రీస్తు రాజ్య పరిపాలన 3) శరీర పునరుత్థానము 4) క్రీస్తు మరల ఈ భూమిమీద కాలు మోపుతాడనే సంగతే లేదు 5) మనమాయనతో రాజ్యపాలన చేతుము అని చెప్పుట లేదు గాని "వారు (యేసును గూర్చి ఆయన వాక్యమునుగూర్చి శిరచ్ఛేదనము చేయబడిన వారి ఆత్మలు) బ్రదికినవారై వెయ్యిసంవత్సరములు క్రీస్తుతో కూడ రాజ్యము చేసిరి" అని చెప్పబడినది.

2. ఈ లేఖనభాగము అలంకారరీతిగా చెప్పబడిన భాషతో, పదములతో నిండియున్నది. ఉదాహరణకు : అగాధముయొక్క తాళపుచెవి, చేత పట్టుకొనియున్న పెద్ద సంకెళ్ళు, అగాధమును మూసి దానికి ముద్రవేసెను, సింహాసనములు, ఆత్మలను చూచితిని, క్రూరమృగము దాని ప్రతిమ, నొసళ్ళయందు చేతులయందు ముద్ర, మొదటి పునరు

త్థానము, రెండవ మరణము, ఆయనతో వెయ్యి సంవత్సరములు రాజ్యము చేసిరి మొదలగునవి.

అనేక గుర్తులతో నిండిన ఈ వాక్యభాగాన్ని వెయ్యేండ్ల పాలన వాదులు ఎంచుకొన్నారు. యిది అనేక గుర్తులతో నిండిన వాక్యభాగ మని వారు ఒప్పుకొంటారు. అలంకారరూపకముగా చెప్పబడిన అనేక పదములలో "వెయ్యి సంవత్సరములు క్రీస్తుతో కూడ రాజ్యము చేసిరి" యను మాటలను ఏరుకొని, విపులంగాయున్న ఇతర లేఖన భాగములతో అది ఏకీభవించకపోయినను, దాన్ని ఉన్నది ఉన్నట్లుగానే అంగీకరించాలని వారు ఒత్తిడి చేస్తారు. ఈ లేఖనభాగములో యున్న ఇతర పదములను అలంకారరీతిగా యున్నవని ఎంచి, వెయ్యేండ్ల కాలాన్ని ఉన్నది ఉన్నట్లుగానే మనం ఎందుకు అంగీకరించాలో వారు చెబితే బావుండును.

3. ఈ వాక్యభాగాన్ని గూర్చి ఏడమ్ క్లార్క్ తన వ్యాఖ్యాన ములో ఇట్లు వ్రాసాడు: "ఈ అంశముపై పురాతనకాలములోను, అధునిక కాలములోను కూడ ఎంతమంది ఎన్ని దర్శనములు చూచియుండలేదు! ఇది 3, 4, 5 వచనాల్లో చెప్పబడిన సంగతి కూడ అపవాదియొక్క ప్రభా వము గొప్పగా సంకుచితము చేయబడిన సమయాన్ని గూర్చి నిస్సందేహ ముగా చెప్పుచున్నది మరియు నిజమైన దేవుని సంఘము గొప్పగా వర్ధిల్లును, అది చిరకాల ముండును. అయితే వెయ్యి సంవత్సరములు అను సంఖ్యను ఉన్నది ఉన్నట్టుగా అంగీకరించుటకు వీలుపడదు... క్షోభములేని దీర్ఘకాల క్రైస్తవ పరిస్థితిని అది సూచింపవచ్చును; గనుక సార్వజనికంగా సువార్త ఆత్మ నిలుచును. అందునుబట్టి క్రీస్తే భూమిమీద పాలించుచున్నట్లగుపడును; నిజానికి అది సంభవించును, ఏలయనగా ఆయన ఆత్మ మానవుల హృదయాలను పాలించును; మరియు ఈ కాలములో హతసాక్షులు తిరిగి జీవించినట్లు చిత్రీకరింప

బద్ధారు; వారిచ్చిన సాక్ష్యము పునరుజ్జీవింపబడి, వారు చనిపోయి తమ రక్తముద్వారా ఏ సత్యాన్ని స్థిరపరచారో అది ఎల్లచోట్ల ఇప్పుడు వ్యాపింపజేయబడి యున్నది. వెయ్యి సంవత్సరములు అను పదము సంగతి అయితే, అది యూదుల మధ్య ఒక గూఢమైన సంఖ్య". ఇది గురుతులతో కూడియున్న భాష గనుక "అది సూచింపవచ్చును" అని ఏడమ్ క్లార్క్ చెప్పుచున్నాడు. అతడు కూడ ఖచ్చితమని చెప్పుట లేదు. వెయ్యేండ్ల పాలనవాదులు నొక్కి వక్కాణించి ధారాళంగా చెప్పుదానికి ఆడమ్ క్లార్క్‌యొక్క అల్ప భాషకు ఈ సందర్భములో గొప్ప వ్యత్యాసమున్నది!

---

Regd. No. H/KD—45/KD.H.O.

*From*
**SATYA WAKKU**
P.O. Box. 80
KAKINADA–533 001

No.

To

..................................................
..................................................
..................................................
..................................................